సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 20 । ఆగస్టు । 2024



సోమశిలలో 24.67 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 24.67 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 11,262 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.73,710
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,670
3 శాతం జీఎస్టీతో	రూ.6,870
సవర (8గ్రా)	రూ.54,960

గరిష్టం/కనిష్టం
37.7 /28.5

వాతావరణం

గాలిలో తేమ 66 శాతంగా సోమవారం నమోదైంది. జిల్లాలో వాతావరణం మంగళవారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ముగిసిన పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి సన్నిధిలో వారం రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. నిత్యహోమాలు, తీర్థప్రసాద వినియోగం, గోపురోత్సవం, పూర్ణాహుతి, తిరుమంజనం, మహాకుంభప్రోక్షణ తదితరాలను వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా పోలూరు సుబ్బయ్య, పద్మావతమ్మ దంపతులు వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపు అడ్డగింత



ఆత్మకూరు రూరల్: మండలంలోని వాశిలి సమీపంలో గల పెన్నానది నుంచి టిప్పర్లు, లారీలతో రాత్రి వేళ ఇసుక అక్రమ తరలింపును గ్రామస్తులు సోమవారం తెల్లవారుజామున అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారమివ్వడంతో కానిస్టేబుల్ వచ్చి రవాణా చేస్తున్న వారిని మందలించారు. కాగా సోమశిలలో సీఎం పర్యటన నేపథ్యంలో మంగళవారం తగు చర్యలు చేపడతామని పోలీసులు హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు.

జలాశయంలో ఆగిన చేపల వేట

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయంలో కొంతమంది అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా చేపలు పట్టి విక్రయిస్తున్న వైనంపై సాక్షిలో ఆది, సోమవారాల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో మత్స్యశాఖ అధికారులు స్పందించారు. చేపలను అక్రమంగా పడుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ప్రాజెక్ట్‌లో వేసిన వలలను తీయించారు. చేపలను పట్టడాన్ని కొనసాగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో జలాశయంలో చేపల వేట ఆగిపోయింది.


డీసీపల్లిలో 807 బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 807 బేళ్లను సోమవారం విక్రయించారని నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 881 బేళ్లు రాగా, వీటిలో 807ను విక్రయించగా, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. 1,05,478 కిలోల పొగాకును విక్రయించగా, రూ.3,00,85,834 వ్యాపారం జరిగిందని వివరించారు. గరిష్ట ధర రూ.358.. కనిష్ట ధర రూ.204.. సగటు ధర రూ.285.23గా నమోదైందని పేర్కొన్నారు. వేలంలో 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారన్నారు.

ధాన్యం రైతు దైన్యం

తగ్గుముఖం పడుతున్న ధరలు

- గత నెల్లో పుట్టి ధర రూ.30 వేలు
- ప్రస్తుతం రూ.26 వేలకు తగ్గిన వైనం
- రబీలో జిల్లాలో 2,60,033 ఎకరాల్లో వరిసాగు
- 8,11,335 మెట్రిక్ టన్నుల దిగుబడి



ధాన్యం ధరలు పతనమవుతుండటంతో అన్నదాతల ఆందోళన వర్ణనాతీతమవుతోంది. గత రబీ సీజన్లో వరిని సాగు చేసిన రైతులు ఆర్థిక స్వావలంబన పొందారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా 20 శాతం వరకు అదనంగా సమకూరడంతో ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఈ తరుణంలో విక్రయించకుండా.. ఆరబెట్టుకొని నిల్వ ఉంచిన ధాన్యం ధరలు ప్రస్తుతం తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో ఏమి చేయాలో పాలుపోక వారు అయోమయానికి గురవుతున్నారు.

పొదలకూరు: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కల్లాల్లో రైతులు విక్రయించడం సర్వసాధారణం. వారికున్న ఆర్థిక పరిస్థితి.. అప్పుల కారణంగా మిల్లర్లకు అమ్ముతుంటారు. అయితే 40 శాతం మంది రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని నిల్వ చేసి.. మంచి ధరలొచ్చాక విక్రయించడమనేది ఎప్పటి నుంచో జరుగుతున్న తంతు. అయితే ఈ దఫా ధరలు తగ్గుముఖం పడుతుండటంతో వారిలో ఆందోళన నెలకొంటోంది. జూన్‌లో పుట్టి ధర రూ.28 వేలు ఉండగా, అది జూలైలో రూ.30 వేల వరకు పలికింది. ప్రస్తుతం రూ.26 వేలకు సైతం దళారీలు, మిల్లర్లు అడగడం లేదు. ఎంతో ఆశపడి నిల్వ చేసుకున్న ధాన్యం ధరలు తగ్గిపోవడమే కాకుండా తమ వద్దకొచ్చి అడిగే నాథుడే లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత రబీలో ఇలా..

జిల్లాలో రబీ సీజన్లో వరిసాగు విస్తీర్ణం అనధికార ఆయకట్టుతో కలిపి దాదాపు నాలుగు లక్షలెకరాలు. అయితే గత రబీలో సకాలంలో వర్షాలు కురవక.. కరువు కోరల్లో జిల్లా చిక్కుకుందని భావించిన రైతులు వరిసాగు మానుకునేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో చెరువులు నిండినా, ప్రాజెక్టుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. ఐఏబీ సమావేశంలో ప్రణాళికబద్ధంగా నిర్ణయాలు తీసుకొని సాగుకు నీటిని విడుదల చేశారు. అంతకు ముందు రబీ సీజన్లతో పోలిస్తే జిల్లాలో లక్ష ఎకరాల విస్తీర్ణం తగ్గినా, అవకాశం ఉన్నంత మేర సాగు చేపట్టారు. ఫలితంగా రబీలో 2.60 లక్షల ఎకరాలకుపైగా సాగు చేయగా, 8,11,335 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది.

అధిక ఆదాయం

అప్పట్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల కంటే 20 శాతం అధికంగా ధరలను మిల్లర్లు చెల్లించారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు ఐదు పుట్ల ధాన్యం దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రాల ద్వారా పుట్టి (850 కిలోలు)కి రూ.18 వేలు ప్రకటించగా, మిల్లర్లు రూ.24 వేల వరకు చెల్లించి కల్లాల్లోనే కొనుగోలు చేశారు.

సాగుచేసిన రకాలు

జిల్లాలోని రైతులు కేఎస్ఎం - 1638, 733, బీపీటీ - 5204, ఎంటీయూ - 1010, ఎన్ఎల్ఆర్ - 34449ను పండించారు. ధాన్యం దేశీయంగా అమ్ముడుపోతూ 20 శాతం ధర పెరిగి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. అయితే నిల్వ చేసుకున్న ధాన్యం ధరలు ప్రస్తుతం పతనమవుతున్నాయి.



రోడ్డుపైనే ధాన్యాన్ని తూకం వేస్తున్న మిల్లర్లు (ఫైల్)

స్టీమింగ్‌తో షాక్

సాధారణంగా జిల్లాలో పండించే ధాన్యం చెన్నైలోని రెడ్‌హిల్స్‌కు ఎగుమతవుతుంది. ఈ తరుణంలో దక్షిణాది ప్రాంతాల్లో ఎడగారు సాగు నూర్పిళ్లు పూర్తయి కొత్తగా దిగుబడైన ధాన్యాన్ని మిల్లర్లు స్టీమింగ్ (నెమ్మును ఆవిరి చేయడం) పద్ధతిలో ఆడిస్తుండటం పాత ధాన్యం ఉన్న రైతులకు షాక్‌గా పరిణమించింది. స్టీమింగ్‌తో పాత ధాన్యం తరహాలోనే బియ్యం ఉంటుంది. దీంతో పాత, కొత్త అనే తేడా ఉండదు. ఈ కారణంగానే నిల్వ చేసిన ధాన్యాన్ని దళారీలు, మిల్లర్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది. మరోవైపు ఎడగారు ధాన్యం మార్కెట్లోకి వస్తే నిల్వ చేసిన వాటి ధరలు మరింత క్షీణించే అవకాశం ఉంది.

ధాన్యం ధరలు తగ్గాయి

ధాన్యం ధరలు నెల క్రితం వరకు ఆశాజనంగా ఉన్నాయి. ప్రస్తుతం తగ్గుముఖం పడుతున్నాయి. ఈ పరిణామం ఆందోళన కలిగిస్తోంది. ధాన్యాన్ని నిల్వ చేయాలంటేనే రైతులు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆరబెట్టిన ధాన్యాన్ని నిల్వ చేసుకుంటే దిగుబడైన రెండు, మూడు నెలలకు మంచి ధరలు లభిస్తాయని ఆశిస్తుంటారు.



– పెంచలరెడ్డి, రైతు

అధికారులు చొరవ చూపాలి

రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యం ధరలు తగ్గకుండా అధికారులు చొరవ చూపాలి. రైతుల వద్దకొచ్చి ధాన్యాన్ని అడిగే పరిస్థితే లేదు. సెప్టెంబర్‌లో ఎడగారు పంట నూర్పిడి పనులు పూర్తయితే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే అవకాశం ఉంది.



– సుబ్బరామిరెడ్డి, రైతు

దిగుబడి బాగుంది

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దిగుబడి పెరిగింది. వరి విస్తీర్ణం తగ్గినా, ఈ పరిణామంతో రైతులు లాభపడ్డారు. అయితే రైతులు నిల్వ చేసుకున్న ధాన్యం ధర తగ్గుతోంది. గత నెల్లో సైతం ఆశించిన ధరలు లభించాయి.



– వాసు, ఏఓ, పొదలకూరు

నిధులకు మంగళమేనా!

పాఠశాలల నిర్వహణకు విడుదల కాని గ్రాంటు

- స్కూళ్లు పునఃప్రారంభమై రెండు నెలలు దాటినా ఇదే పరిస్థితి
- చాక్‌పీస్, డస్టర్, రిపేర్లకూ ఇబ్బందులే..
- ప్రధానోపాధ్యాయులే భరించాల్సిన వైనం
- మీనమేషాలు లెక్కిస్తున్న సర్కార్
- గతంలో సకాలంలో విడుదల

ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత.. విడుదలకు నోచుకోని నిర్వహణ నిధులు.. వెరసి అక్కడ పరిస్థితి దయనీయంగా మారింది. ఈ క్రమంలో చాక్‌పీస్.. డస్టర్.. స్వల్ప మరమ్మతులు.. కాగితాలు.. మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు అవసరమైన చీపురు మొదలుకొని ఫినాయిల్ వరకు ఏది కొనుగోలు చేయాలన్నా ప్రధానోపాధ్యాయులు తమ జేబులో నుంచి తీయాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. ఈ నిధుల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నెల్లూరు (టౌన్): రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటినా, ప్రభుత్వ పాఠశాలలపై ఏ మాత్రం దృష్టి సారించలేదనే అంశం వారి వైఖరితో స్పష్టమవుతోంది. వాస్తవానికి స్కూళ్ల అవసరాల రీత్యా ఏటా నిర్వహణ నిధులను మంజూరు చేస్తారు. అయితే ఈ అంశాన్నే ప్రభుత్వం విస్మరించింది. ఫలితంగా ప్రధానోపాధ్యాయులపై ఆ భారం పడుతోంది.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

జిల్లాలో 2592 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో ప్రాథమిక 2021.. ప్రాథమికోన్నత 238.. హైస్కూళ్లు 283, హైస్కూల్ ప్లస్ 50 వరకు ఉన్నాయి. ఇందులో 1,81,392 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీటికి సంబంధించిన నిర్వహణ నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు విడుదలవుతాయి. తరగతి గదుల్లో వినియోగించే చాక్‌పీస్, డస్టర్, రిజిస్టర్లతో పాటు ఫ్యాన్లు, లైట్లు తదితరాలకు ఈ మొత్తాన్ని వెచ్చించాల్సి ఉంది.

ఎప్పటికి వస్తాయో..?

పాఠశాల నిర్వహణ నిధులను ఈ ఏడాది విడుదల చేస్తారానే అంశం ప్రస్తుతం సస్పెన్స్‌గా మారింది. నిధులు విడుదలకు నోచుకోకపోవడంతో ప్రతి పైసాను ప్రధానోపాధ్యాయులు తమ జేబులో నుంచి తీయాల్సి వస్తోంది. ఈ గ్రాంట్‌ను మంజూరు చేయకపోతే రానున్న రోజుల్లో పాఠశాల నిర్వహణ కష్టమనే భావన వారిలో వ్యక్తమవుతోంది.

తరగతి గదిలో విద్యార్థులు



నాడెంతో ఘనం

పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహణ నిధులను నాటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సకాలంలో మంజూరు చేసేవారు. విద్యార్థులకు అందజేసే అమ్మఒడి నిధుల నుంచి రూ.వెయ్యిని మినహాయించి పాఠశాలల్లో అవసరమయ్యే ప్రతి వస్తువునూ కొనుగోలు చేసేందుకు ఈ నిధులను కేటాయించేవారు. విద్యాసంస్థలను ప్రారంభించిన వెంటనే ఈ నిధులను విడుదల చేసేవారు. దీంతో అక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సమకూరేవి.

మంజూరు ఇలా..

విద్యార్థులు	విడుదలయ్యే మొత్తం
20లోపు	రూ.10 వేలు
21 నుంచి 49లోపు	రూ.15 వేలు
50 నుంచి 100లోపు	రూ.20 వేలు
101 నుంచి 250లోపు	రూ.50 వేలు
251 నుంచి వెయ్యిలోపు	రూ.75 వేలు
వెయ్యి దాటితే	రూ.లక్ష

నిధులింకా రాలేదు

పాఠశాల నిర్వహణ నిధులు ఈ ఏడాది ఇంకా మంజూరు కాలేదు. గతంలో అమ్మఒడి నుంచి కొంత మొత్తాన్ని మినహాయించి వీటిని అందజేసేవారు. ఈ ఏడాదికి సంబంధించిన నిధులు త్వరలో విడుదలయ్యే అవకాశం ఉంది. ఇవి వచ్చిన వెంటనే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో జమచేస్తాం.

– ఉషారాణి, ఏపీసీ, సమగ్రశిక్ష

మరోవైపు తల్లికి వందనాన్ని ఈ ఏడాది ఇచ్చేది లేదని శాసనసభలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రకటించారు. దీన్నే ఇవ్వకపోతే ఇక నిర్వహణ నిధుల సంగతేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాల విద్యాశాఖ ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మెయింటెనెన్స్ గ్రాంట్‌ను త్వరగా విడుదల చేసేలా చొరవ చూపాలని కోరుతున్నారు.

సోమశిల జలాశయానికి రూ.8 కోట్లు అవసరం



జలాశయాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

నెల్లూరు(దర్గామిట్ట): సోమశిల జలాశయ ప్రధాన సమస్యల పరిష్కారానికి రూ.ఎనిమిది కోట్లు అవసరమని సీఎం చంద్రబాబుకు అధికారులు విన్నవించారు. జలాశయ సందర్శనలో భాగంగా సోమవారం విచ్చేసిన సీఎంకు స్థానిక గిరిజన గురుకుల పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ స్వాగతం పలికారు. జలాశయంలోని 12 క్రస్ట్ గేట్లలో నాలుగు మరమ్మతులకు గురయ్యాయని, వీటికి రూ.2.42 కోట్లు అవసరమని అధికారులు తెలియజేశారు. కండలేరు వరద కాలువకు నీటిని విడుదల చేసే కుడి హెడ్‌రెగ్యులేటర్ దెబ్బతినిందని, భవిష్యత్తులో అక్కడికి నీటి విడుదల కష్టమవుతుందని, దీనికి రూ.5.48 కోట్లు అవసరమని తెలిపారు. వరదలతో జలాశయం వద్ద దెబ్బతిన్న ఆప్రాన్ పనులకు గత ప్రభుత్వం రూ.99 కోట్లను మంజూరు చేసిందని, పనులు 21 శాతం మేర పూర్తయ్యాయని తెలియజేశారు.

అర్జీ ఇవ్వాలని వచ్చి.. నిరాశకు గురై

ఆత్మకూరు: సోమశిల ప్రాజెక్ట్ పరిశీలన అనంతరం ప్రజావేదికను సీఎం చంద్రబాబు నిర్వహించారు. కార్యక్రమ చివర్లో అర్జీలను అందజేయాలని సూచించడంతో, ఒక్కసారిగా పలువురు దూసుకెళ్లారు. సోమశిల ప్రాజెక్ట్ కార్యాలయం, నెల్లూరులో పనిచేసే శ్యామసుందర్‌రావు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఏడాదిగా మంచానికే పరిమితమయ్యారు. రూ.35 లక్షల వరకు వెచ్చించి, వైద్యం చేయించారు. మరింత మెరుగైన వైద్యానికి రూ.25 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలియజేశారు. ఇదే అంశాన్ని సీఎంకు విన్నవించాలనే ఉద్దేశంతో నెల్లూరు నుంచి కుటుంబంతో సహా వచ్చినా, అర్జీ ఇచ్చే అవకాశం లభించలేదు. దీంతో అక్కడున్న ఓ అధికారికి అర్జీ ఇచ్చి, సీఎంకు అందజేయాలని వారు ప్రాధేయపడ్డారు.

ఒక్క రోజే 330కుపైగా రిజిస్ట్రేషన్లు

నెల్లూరు సిటీ: నెల్లూరు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లో సోమవారం ఒక్కరోజే 330కుపైగా వివిధ రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాస్తవానికి గత నాలుగు నెలలుగా పదుల సంఖ్యలో కూడా రిజిస్ట్రేషన్లు జరగలేదు. ఈ క్రమంలో మంచి రోజు కావడంతో భారీగా పోటెత్తారు. నెల్లూరు ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 80, స్టోన్‌హౌస్‌పేటలో 25, బుజబుజ నెల్లూరు, అల్లూరు, కావలి, ఆత్మకూరు, ముత్తుకూరు, వింజమూరు, ఉదయగిరి, కోవూరు, రాపూరు, బుచ్చిరెడ్డిపాళెం, పొదలకూరు, ఇందుకూరుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 225కుపైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి.

ఖాకీలపై క్రౌర్యం

రెచ్చిపోతున్న టీడీపీ మూకలు

- మొన్న సీఐపై మంత్రి సమక్షంలోనే దాడికి యత్నం
- తాజాగా మహిళా ఎస్సై, హెడ్ కానిస్టేబుల్‌పై దాష్టీకం
- కేసుల నమోదుకు సాహసించని పోలీసులు

ప్రజలకు రక్షణ కల్పించే ఖాకీలకు ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో రక్షణ కరువైంది. వీరిపై పచ్చ పార్టీ మూకలు దాడులు చేయడం నిత్యకృత్యమైంది. తమ సహచరులపై దాష్టీకాలు ఎక్కువవుతున్నా, కేసులు నమోదు చేసేందుకు ఖాకీ బాస్‌లు సాహసించడంలేదు. మరోవైపు దాడులకు గురైన వారిపైనే తమ్ముళ్లు కేసులు పెడుతుండటం గమనార్హం.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఖాకీలపై టీడీపీ శ్రేణుల అరాచకాలకు అంతేలేకుండా పోతోంది. ఈ ఘటనలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు సైతం పోలీసులు సాహసించడం లేదు. తాజాగా విధి నిర్వహణలో ఉన్న మహిళా ఎస్సైపై అధికార పార్టీకి చెందిన రౌడీషీటర్, వారి అనుచరులు దాడి చేసినా, ఘటనను ఆ శాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. డ్యూటీలో ఉన్న హోంగార్డును సామాన్యులు టచ్ చేసినా, వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి కుళ్లబొడిచే పోలీస్ శాఖ ఈ రకంగా మౌనం దాలుస్తోంది.

మితిమీరుతున్న రాజకీయ జోక్యం

టీడీపీ హయాంలో పోలీస్ శాఖలో రాజకీయ జోక్యం మితిమీరుతోంది. తమకు తెలియకుండా ఏ విషయం జరగకూడదంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఎస్సైల బదిలీలు జరిగినట్లు ఉత్తర్వులు వెలువడుతున్నా, వివిధ కారణాలతో కొద్ది గంటల్లోనే రద్దు చేస్తున్నారు. ఎమ్మెల్యేల సిఫార్సు ఉన్న వారికే పోస్టింగ్‌లు ఇవ్వాల్సిన దుస్థితి. వీరి అండతో బదిలీల ఉత్తర్వులు వెలువడినా, రెడ్‌బుక్ క్లియరెన్స్ లేదంటూ నిలిపేస్తున్న పరిస్థితి. ఈ పరిణామాల క్రమంలో అధికార పార్టీ నేతల సేవలో పోలీసులు నిమగ్నమై, తమ విధులను సక్రమంగా నిర్వర్తించలేని దుస్థితి నెలకొంటోంది.

ఇవీ ఉదాహరణలు..

➡ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కార కార్యక్రమాన్ని మంత్రి నారాయణ ఇటీవల నిర్వహించారు. దీనికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే అనుచరులు విధి నిర్వహణలో ఉన్న దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్, స్పెషల్ పార్టీ పోలీసులను దుర్భాషలాడారు. ఓ దశలో ఏయ్.. ఏమి చేస్తావ్.. ఇక్కడి నుంచి వెళ్లిపో అంటూ హుకుం జారీ చేసి దాడికి యత్నించారు. ఇది జరిగిన గంటల వ్యవధిలోనే పోలీస్ కార్యాలయంలో సీఐ రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

➡ తాజాగా విధి నిర్వహణలో ఉన్న నార్త్ ట్రాఫిక్ ఎస్సై గీతారయ్య, హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణపై టీడీపీ నేతలు కప్పిర దంపతులు తమ అనుచరులతో కలిసి దాడి చేశారు. ఉదంతాన్ని వీడియో తీస్తున్న మరో వ్యక్తిని చితకబాదారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా ఓ ఆటోను పట్టుకోవడమే వీరు చేసిన నేరమనే రీతిలో పచ్చ పార్టీ నేతలు రెచ్చిపోయారు. తోపులాటలో కిందపడిన మహిళా నేత తలకు గాయమవ్వడంతో, ఆస్పత్రిలో చేర్పించి పోలీసులపైనే తిరిగి ఫిర్యాదు చేయించారు.

గత టీడీపీ హయాంలోనూ ఇంతే..

➡ 2014 – 19 కాలంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడూ ఇదే పరిస్థితి. ఆ సమయంలో మంత్రిగా ఉన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాలుగో నగర సీఐ సీతారామయ్యను ప్రజల సమక్షంలోనే దుర్భాషలాడారు. మంత్రి వస్తే రావాలని తెలియదా.. బలిసిందా.. జాగ్రత్తగా ఉండు అంటూ చిందులేశారు. తానేమి తప్పు చేశానని తిడతారు.. ఇదేమి బాగోలేదని సదరు సీఐ నిలదీయడంతో, ఆగ్రహించిన సోమిరెడ్డి ఆయన్ను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేయించారు.

➡ అప్పట్లో ఓ ఎమ్మెల్యే అక్రమాలను వెలికితీసిన నాటి ఎస్పీ సెంథిల్‌కుమార్‌పై మీడియా సాక్షిగా బెదిరింపులకు దిగారు. ఇది జరిగిన కొద్ది రోజుల్లోనే ఎస్పీని బదిలీ చేశారు.

చేతులు కట్టుకొని కూర్చున్నారు..

అధికార పార్టీ నేతల కనుసన్నల్లో పోలీస్ శాఖ నడుస్తోంది. తాము చెప్పిందే వేదం.. చేసిందే చట్టమనే రీతిలో టీడీపీ నేతలు చెలరేగిపోతున్నారు. అధికార పార్టీ నేతలను కాదని ఏ చిన్న పనిచేసినా, వెంటనే బదిలీల ఉత్తర్వులు వెలువడుతున్నాయి. టీడీపీ నేతలు దాడులు చేసినా అవమానభారంతో కుంగిపోతున్నారే తప్ప తిరిగి ప్రశ్నించే సాహసం చేయలేకపోతున్నారు.

రక్షణ కోసం పోరుబాట

'నైట్ డ్యూటీకి వెళ్లాలంటేనే భయంగా ఉంటుంది. కొందరు మద్యం తాగొచ్చి మత్తులో రచ్చ చేస్తుంటారు. వారిని బయటకు పంపాలని ప్రయత్నించినా వినరు. గ్రామాల్లో ఘర్షణలు జరిగి గాయపడిన వారు చికిత్స నిమిత్తం వస్తారు. మా ముందు గొడవలు పడుతుంటారు. ఇక్కడ ఇలా చేయకూడదని చెబితే మాపై కేకలు వేసిన సందర్భాలున్నాయి.' జిల్లాలోని ఓ పట్టణంలో ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సు ఆవేదన ఇది. కోల్‌కతాలో జరిగిన హత్యాచార ఘటన తర్వాత మహిళా వైద్యులు, సిబ్బందిలో ఆందోళన మరింత పెరిగింది.

- ప్రాణాలు నిలబెట్టే వారికి భద్రత కరువేనా?
- కోల్‌కతా ఘటనతో ఉలిక్కిపడిన వైద్యులు
- ఆందోళనలో మహిళా డాక్టర్లు, సిబ్బంది
- బిక్కుబిక్కుమంటూ విధులకు..
- భరోసా కల్పించాలని విజ్ఞప్తి


నెల్లూరులో ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): కోల్‌కతా ఆర్జీకార్ మెడికల్ కళాశాలలో పీజీ ట్రెయినీ డాక్టర్‌గా పనిచేస్తున్న వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తోంది. దీనికి నిరసనగా జిల్లాలో ఐదురోజులుగా డాక్టర్లు, వైద్య సిబ్బంది ఆందోళన బాట పట్టారు. దోషులను శిక్షించాలని, ప్రాణం పోస్తున్న డాక్టర్లకు పనిచేసే చోట రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రశ్నార్థకంగా రక్షణ

జిల్లాలో పనిచేస్తున్న వైద్యులకు రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. నెల్లూరులోని బోధనాస్పత్రి, ఆత్మకూరులోని జిల్లా ఆస్పత్రి, కావలి, కందుకూరులోని ఏరియా హాస్పిటళ్లతోపాటు పీహెచ్‌సీల్లో సైతం మహిళా వైద్యులకు తగినన్ని విశ్రాంతి గదులుండాలి. తగిన రక్షణ వ్యవస్థ ఉండాలి. చుట్టూ రోగులు, నర్సింగ్ సిబ్బందితో కూడిన జన సంచారముండాలి. ఆకతాయిలు ఏదైనా అంటే 5 నిమిషాల్లో పోలీసులు వచ్చి తగిన చర్యలు చేపట్టేలా వ్యవస్థ ఉండాలి. అలా లేకపోవడమే కోల్‌కతా ఘటనకు ప్రధాన కారణమైంది.

చట్టం అమలుపై నిర్లక్ష్యం

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అందువల్లే రెండు నెలల కాలంలో దాడులు ఎక్కువయ్యాయి. సుప్రీం కోర్టు సూచనల మేరకు మహిళా ఉద్యోగులు పనిచేసే చోట అంతర్గత ఫిర్యాదుల కమిటీ, లోకల్ కంప్లైంట్ కమిటీ, డాష్‌బోర్డు నిర్వహించాలి. మహిళా రక్షణ చట్టాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టి నిధులు విడుదల చేయాలని వైద్య విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

కళ్లు తెరిచిన అధికారులు

కోల్‌కతా ఘటన తర్వాత తమకు రక్షణ కల్పించాలని జూనియర్ డాక్టర్లు ఆందోళనలు ఉధృతం చేయడంతో నెల్లూరులోని సర్వజన ఆస్పత్రి, మెడికల్ కళాశాల అధికారులు కళ్లు తెరిచారు. హాస్పిటల్లో అన్ని సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు చేపట్టారు. ప్రధానంగా మహిళలు ఎక్కువగా ఉండే ప్రసూతి వార్డు దగ్గర 32 మంది సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేశారు. బయట నుంచి వచ్చే ఆటోలను ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రసూతి వార్డులోకి మగవారిని అనుమతించడం లేదు. మద్యం సేవించిన వారిని బయటకు పంపిస్తున్నారు. ఆస్పత్రిలో ఘర్షణ వాతావరణం ఉన్నప్పుడు అవుట్‌పోస్టు పోలీసులు నివారించాలని ఎస్పీని ఆస్పత్రి సూపరింటెండెంట్ కోరగా అందుకు అంగీకరించారు. బీట్ కానిస్టేబుళ్లు ఆస్పత్రిలో రాత్రి పూట మూడు దఫాలు రౌండ్స్ వేసేలా చర్యలు తీసుకోవాలని కోరగా ఒప్పుకొన్నారు. డాక్టర్ల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, నేరాలకు పాల్పడినా పడే శిక్షలు గురించి బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



మా ఆందోళలను అర్థం చేసుకోవాలి. రక్షణ కల్పించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి. జూనియర్ డాక్టర్లకు భరోసా కల్పించాలి. మా ఆందోళనలపై మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంపీలు స్పందించాలి.

– రాజ్‌కుమార్, జూడాల అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్

జిల్లాలో..

బోధనాస్పత్రి (సర్వజన ఆస్పత్రి)	:1
జిల్లా ఆస్పత్రి	:1
ఏరియా ఆస్పత్రులు	: 2
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	:10
పీహెచ్‌సీలు	:52
పట్టణ ఆరోగ్య కేంద్రాలు	:28

పనిచేస్తున్న మహిళా వైద్యులు, సిబ్బంది : **2,700** మంది

జూనియర్ డాక్టర్లు : **195** మంది

పీజీ డాక్టర్లు : **25** మంది

నర్సింగ్ విద్యార్థినులు : **700** మంది

జిల్లాలో రోజూ సరాసరిన వస్తున్న ఓపీ : **13,500**

సర్వజన ఆస్పత్రిలో సీసీ కెమెరాలు: **138**

సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు : **110**

కొన్ని ఘటనలు

- రెండున్నరేళ్ల క్రితం సర్వజన ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా ఉన్న ఓ డాక్టర్‌పై తాగొచ్చిన ఆటో డ్రైవర్ ఘర్షణకు దిగాడు. చొక్కాలు పట్టుకున్నారు.
- కారణమేదైనా ఇటీవల ఓ మహిళా డాక్టర్ మెడికల్ కళాశాల పైఅంతస్తు నుంచి కిందపడి మృతిచెందారు. అక్కడ సెక్యూరిటీ ఉండి ఉంటే అలా జరిగేది కాదు.
- సంవత్సరం క్రితం జీజీహెచ్‌లో ఎంసీహెచ్ (తల్లీబిడ్డ) వార్డులో ఏకంగా ఓ చిన్నారిని వేరే ప్రాంతానికి చెందిన వ్యక్తి అపహరించుకెళ్లాడు. పోలీసులు రంగంలో దిగి ఆ బిడ్డను తల్లి వద్దకు చేర్చారు. అక్కడ తగినంత సెక్యూరిటీ సిబ్బంది, సీసీ కెమెరాలు లేకపోవడంతోనే ఈ ఘటన జరిగింది.
- గతంలో పెద్దాస్పత్రిలో ఓ డాక్టర్‌పై దాడి చేయడంతో గాయాలయ్యాయి.
- మండలాల్లోనూ డాక్టర్లు, సిబ్బందిపై దౌర్జన్యం చేసిన ఘటనలున్నాయి.

భద్రత కల్పించాలి



రోగులను, ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను కాపాడుతూ ప్రాణం పోస్తున్న మాకు అరాచక శక్తుల నుంచి భద్రత కల్పించాలి. కొన్ని అసాంఘిక శక్తులు దాడులు చేస్తూ ప్రాణాలు తీస్తున్నా రాజకీయ నాయకులు స్పందించకపోవడం బాధాకరం. కోల్‌కతా ఘటన మమ్మల్ని బాధకు గురి చేసింది. ఇలాంటి దారుణాలు జరగకూడదని కోరుకుంటున్నాం. అందుకోసం పోరుబాట పట్టాం.

– ఐశ్వర్య, జూనియర్ డాక్టర్, సర్వజన ఆస్పత్రి

బాధతోనే సర్వీసులు ఆపి సమ్మె బాట



ఒక డాక్టర్‌గా రోగులకు వైద్యసేవలు ఆపడం వల్ల ఎంతో బాధ కలుగుతోంది. అయితే డాక్టర్లపై ఇటీవల కాలంలో తరచూ దాడులు జరుగుతున్నాయి. మహిళా డాక్టర్లపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సమ్మె బాట పట్టాం. ప్రజలు సహకరించాలి.

– సాయిశ్రేయ, హౌస్‌సర్జన్

ప్రత్యేక చట్టం అవసరం



మాకు న్యాయం చేయాలని ఇన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం ఇంకా స్పందించకపోవడం బాధాకరం. ఇకనైనా ప్రభుత్వం స్పందించి డాక్టర్లపై దాడులు జరకుండా ప్రత్యేక చట్టం అవసరం. పనిచేసే చోట భద్రత కల్పించాలి.

– జునైద్ అలీఅహ్మద్, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

భానుడి భగభగలు
తట్టుకోలేకున్నాం



అబ్బా.. ఈ చెమటేంది.. ఇది ఎండా కాలమా.. వర్షా కాలమా.. కొద్దిరోజులుగా జనం నోటి వెంట ఈ మాటలే వినిపిస్తున్నాయి. భానుడి భగభగలతో అందరూ అల్లాడిపోతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పని నిమిత్తం రోడ్డెక్కిన వారు ఎప్పుడెప్పుడు ఇంటికి వెళ్లిపోయి సేద తీరుదామా అని పరుగులు పెడుతున్నారు.

వేసవిని తలపిస్తున్న ఉష్ణోగ్రతలు

- కొద్దిరోజులుగా చినుకు జాడే లేదు
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- పెరిగిన విద్యుత్ వినియోగం

నెల్లూరు సిటీ: జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కొద్దిరోజుల నుంచి ఉక్కపోత ప్రజలను ఊపిరాడకుండా చేస్తోంది. వాతావరణం వేసవి కాలాన్ని తలపిస్తోంది. పదిరోజులుగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే హడలిపోతున్నారు. పగటి ఉష్ణోగ్రత గరిష్టం 35 డిగ్రీలకు పైనే ఉంటోంది. 38 డిగ్రీలు దాటిన రోజులున్నాయి. గతేడాది ఇదే నెలలో 32 నుంచి 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు మాత్రమే నమోదయ్యాయి. ఈసారి నాలుగు డిగ్రీలు పెరిగాయి. ఉదయం 8 గంటల నుంచి ఉక్కపోత మొదలవుతోంది. రాత్రి వేళల్లో కూడా ఇంట్లో వేడిని తట్టుకోలేక ప్రజలు ఏసీలు, కూలర్ల మీద ఆధారపడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఈ ఎండలు చూస్తోంటే వేసవి గుర్తుకొస్తుందని జనం చెబుతున్నారు. పనులకు వెళ్లేందుకు కూలీలు జంకుతున్న పరిస్థితులున్నాయి. ఉక్కపోతతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అల్లాడిపోతున్నారు.


ఉండలేక..

ఎండాకాలంలో తప్పని పరిస్థితుల్లో ఏసీలు, కూలర్లు వినియోగిస్తుంటారు. వర్షాకాలం, చలికాలంలో ఈ పరిస్థితి చాలా వరకు ఉండదు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ముఖ్యంగా ఫ్యాన్లు, ఏసీలు నిరంతరాయంగా పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈసారి కరెంట బిల్లు అధికంగా వస్తుందని చాలామంది ఆందోళనకు గురవుతున్నారు. సాధారణంగా ఆగస్ట్ నెలలో జిల్లాలో 13 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ వినియోగం ఉంటుంది. కానీ ఈ ఏడాది 15 మిలియన్ యూనిట్లు ఉన్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.


ఎండకు తాళలేక టోపీలు, కళ్లద్దాలు పెట్టుకుని వెళ్తూ..

కొద్దిరోజులుగా జిల్లాలో ఇలా..

తేదీ	గరిష్టం	కనిష్టం
11	38.2	28.6
12	38.5	28.0
13	37.1	29.0
14	37.4	27.1
15	36.6	28.5
16	36.4	28.0
17	37.0	28.2
18	37.9	28.9



ఎండలు భయపెడుతున్నాయి



కొన్నిరోజులుగా ఎండలు చూస్తుంటే భయం వేస్తోంది. ఎండాకాలం మళ్లీ వచ్చిందా అనిపిస్తోంది. మొన్నటి వేసవికి చాలా ఇబ్బందులు పడ్డాం. వర్షా కాలం వచ్చిందిలే సేదతీరొచ్చని భావించాం. ఇప్పుడున్న వాతావరణం ఆందోళనకు గురి చేస్తోంది.

– షేక్ కరీం, గాంధీనగర్

కరెంట్ బిల్లుపై ఆందోళన



వర్షాకాలంలో కరెంట్ బిల్లు తక్కువ వస్తుంది. కానీ పెరిగిన ఉష్ణోగ్రతలతో ఏసీ, ఫ్యాన్లు రోజంతా వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈసారి కరెంట్ బిల్లు పెరుగుతుందని ఆందోళన చెందుతున్నాం.

– వెంకటేశ్వర్లు, వీఆర్సీ సెంటర్

సూర్యప్రభ వాహనంపై వెంకయ్యస్వామి విహారం


వెంకయ్యస్వామి ఊరేగింపు

వెంకటాచలం: మండలంలోని గొలగమూడిలో వెంకయ్య స్వామి 42వ ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన సోమవారం సూర్యప్రభ వాహనంపై స్వామి విహరించారు. ముందుగా ఆశ్రమంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూలతో శోభాయమానంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామి ఆశీనులై భక్తులను కటాక్షించారు. నాయుడుపేటకు చెందిన సన్నారెడ్డి కృష్ణారెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు. రాత్రి చంద్రప్రభ వాహనసేవను నిర్వహించారు. దీనికి ఆల్తూరి గిరీష్‌రెడ్డి – లత దంపతులు, ఆల్తూరి మహేష్‌రెడ్డి – రాధిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉత్సవాలను ఆశ్రమ కార్యనిర్వాహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

- మంగళవారం ఉదయం హనుమంత వాహనసేవ, రాత్రి హంస వాహనసేవను నిర్వహించనున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

పొదలకూరు

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.120
సన్నవి	: రూ.80
పండ్లు	: రూ.60



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 123
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 222
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 244
లేయర్ చికెన్	: 178



సమస్యలు విని.. హామీ ఇవ్వకుండానే..

- ఇదీ సీఎం చంద్రబాబు ప్రజా వేదిక తీరు
- ఇసుకను తోడేస్తున్నారన్న గ్రామస్తులు

ఆత్మకూరు: ముఖ్యమంత్రికి సమస్యలు చెబుతున్నాం. ఇట్టే పరిష్కరిస్తారని భావించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. సీఎం చంద్రబాబు సోమవారం సోమశిల జలాశయాన్ని పరిశీలించారు. అనంతరం ప్రజా వేదిక నిర్వహించారు. పడమటికంభంపాడులో యంత్రాలతో రీచ్ నుంచి ఇసుకను తోడేస్తున్నారని, దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, అలాగే గ్రామంలోని వ్యక్తులకు రీచ్‌లో పనులను కల్పించడం లేదని పలువురు చెప్పారు. ఎస్టీకాలనీలో తాగునీటి సమస్య ఉందని, పెద్ద ట్యాంక్ నిర్మించాలని భాగ్యమ్మ అనే మహిళ వివరించారు. హైలెవల్ కెనాల్‌లో భాగంగా పొంగూరు, పడమటినాయుడుపల్లి వద్ద రిజర్వాయర్లను పూర్తి చేయాలని మర్రిపాడు మండలానికి చెందిన రైతులు కోరారు. తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని ఆరోగ్య శాఖలోని పారామెడికల్ సిబ్బంది విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలను విన్న చంద్రబాబు పరిష్కరిస్తామని ఎలాంటి హామీ ఇవ్వకపోగా, కలెక్టర్‌కు చెబుతానని నామమాత్రంగా చెప్పడంతో జనమంతా అసహనం వ్యక్తం చేశారు.

అర్జీలు స్వీకరించిన డీఆర్వో


సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం డీఆర్వో లవన్న ఆధ్వర్యంలో జరిగింది. సీఎం చంద్రబాబు నాయుడి పర్యటనకు కలెక్టర్, ఇతర అధికారులు వెళ్లడంతో అర్జీలను డీఆర్వో తీసుకున్నారు. నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి నేతలు వినతిపత్రం సమర్పించారు. దివ్యాంగులను కించపరిచినా, అవమానించినా, భయపెట్టినా, లైంగికదాడి చేసినా, సహాయ పరికరాన్ని ధ్వంసం చేసినా ఆరు నెలల నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ పరిమళ పాల్గొన్నారు.

సాక్షి Smart Economic Display SED Advertisement Feature

చెన్నై హాస్పిటల్స్ ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్
కావేరి హాస్పిటల్స్, చెన్నై
kauvery hospital

Dr.NITHYANANDHAN
డా॥ నిత్యానందన్
M.B.B.S., MD.(Internal Medicine), D.M.
(Pulmonary and Critical Care Medicine)
(ఊపిరితిత్తుల వైద్య నిపుణులు)

★ ఆస్తమా, ఆయాసం, ఊపిరితిత్తులలో నెమ్ము
★ ఛాతి నొప్పి, ఎడతెరగని దగ్గు, తుమ్ములు
★ పిల్లికూతలు, గురక, గాలి పీల్చుకోవడం కష్టంగా ఉన్నా
★ దుమ్ము, ధూళి, బూజు వలన అలర్జీ
★ శీతల పానీయాలు మరియు చల్లని వాతావరణం వలన సమస్యలు
★ ఊపిరితిత్తుల బయాప్సి, ఇమ్యునోథెరపీ అలర్జీ
★ బ్రాంకోస్కోపి, ధృడమైన బ్రాంకోస్కోపి (Rigid Branchoscopic)
★ EBUS (Endrobronchial Ultrasound)

అవసరమైన వారికి ఊపిరితిత్తుల మార్పిడి చేయబడును.

Dr. S. MANIKANDA PRABHU
డా॥ యస్. మణికండ ప్రభు
MBBS., (Gen. Surgery) DNB
(Peripheral Vascular Surgery), Consultant Vascular Surgery,
రక్తనాళాల వైద్య నిపుణులు (వాస్కులర్ సర్జన్)

★ షుగర్ వలన పాదాలు గాయపడిన
★ కాళ్ళు నరాలు ఉబ్బగా ఉన్నా (సీరు), వాపు, దురద
★ ఎర్రపుండ్లు, గాంగ్రీన్ (అల్సర్)
★ పాదాలు పొడిబారుట, రంగు మారుట

బి.పి., షుగర్ ఉండి 50 సం॥ వయస్సు నిండి నరాల (వ్యారికోస్ వెయిన్స్) నొప్పులతో నడవలేక పోతున్న వారికి సదవకాశం

ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకొనవలెను
తేది 23-08-2024 (శుక్రవారం) ఉ॥ 10 గం॥ల నుండి మ॥ 3 గం॥ల వరకు
అపాయింట్‌మెంట్ కొరకు : 93999 99990, 93999 99951
CHIC 24-2/395, సరస్వతి నగర్, రత్నం హైస్కూల్ ఎదురుగా యూనియన్ బ్యాంక్ ప్రక్కన, మాగుంట లే-అవుట్, నెల్లూరు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR

■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629 [T-2244]

■డైరెక్ట్ 10th, ఒకే సం॥లో ఇంటర్ B.Tech, M.Tech, MBA, MCA, M.Sc, M.Com, MA, M.VOC, MLisc, BCA, BBA, B.Sc, B.Com, B.A, BLisc, B.VOC, P.hd, RIPS-Nellore @ 8008010144. [NA-5413]

REAL ESTATE

FLAT FOR SALE

■ధనలక్ష్మీపురం KGK కళ్యాణ మండపం ఎదురుగా శ్రీ బాలాజీ సన్ సిటీ గేటెడ్ కమ్యూనిటీలో అపార్ట్‌మెంట్ నందు ఫ్లాట్ అమ్మబడును. ఒక ఫ్లాట్ గానీ లేదా మొత్తం అపార్ట్‌మెంట్ గానీ అమ్మబడును (Ready to Occupy). 99499 21853, 93908 45455. [NA-23669]

PLOT FOR SALE

■నెల్లూరు సిటీ అయ్యప్ప గుడి ఎదుట ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ దగ్గర వుడ్ కాంప్లెక్స్‌లో 150 అంకణముల ఖాళీ స్థలము అమ్మబడును. సెల్ : 85004 02888, 80745 18919. [NA-2694]

■నెల్లూరు, ధనలక్ష్మీపురం, వెంకటాచలం, మనుబోలు హైవే, గూడూరు, ఆత్మకూరు, బుచ్చి బాంబే హైవే దగ్గర తక్కువధరకే ప్లాట్స్, నుడా ప్లాట్స్, బ్యాంకు లోన్, స్పాట్Reg.9652667237, 98490 02009. [NA-23681]

WANTED

■B.Tech / BE / Diploma (ECE, EEE, Mech) Fresh Female Candidates, having knowledge in MS Office, CAD & handling projects@Filed. 9150061325, 7842015550. [NA-6559]

■Wanted Teachers to Teach Maths Subject 6 & 7 Classes. attractive Salary. Contact : 89858 50824, 63034 39646. [NA-11184]

CHANGE OF NAME

I, SOKALARAMJI DHANARAJ (Old Name), Residing at 16-3-260, Mungamurivari Street, Near Oxford School, Nellore, SPSR Nellore District, AP. Here by declare that I have changed my name as DHANARAJ PRAJAPAT S/o. SOKALARAMJI.

■We Want Receptionist. Future Fitness GYM, Nellore. Computer Knowledge Compulsory. Salary Based On Experienced. Cell : 81434 33878, 94923 33878. [NA-6563]

■నెల్లూరులో ప్రముఖ ఆక్వా కంపెనీలో పని చేయుటకు ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీస్ కార్ డ్రైవర్ కావలెను. సెల్: 97032 27878. [NA-6564]

■నెల్లూరు, హరనాథపురం మెయిన్ రోడ్‌లో AMR పెట్రోల్ బంకు నందు నైట్ షిఫ్ట్‌లో పని చేయుటకు యువకులు కావలెను. జీతం: 13,000/-.సంప్ర:8985264143, 9494797343. [NA-6562]

■వాటర్ ప్లాంట్ నందు గుమస్తాగా పని చేయుటకు గుమస్తాలు కావలెను. జీ: 15000/-.(రూం+భో)ఫ్రీ-డ్యూటీ:12.00గం॥లు.Qlf:10th+ డిగ్రీ. ఉత్సాహవంతులైన యువకులు. సంప్ర: 9618610203. [NA-23662]

■బ్యాంక్ లోన్స్ ప్రాసెస్ నందు Tele Caller కావలెను. Married Female, టార్గెట్స్ లేవు. జీతం : 12,000/-. ట్రంక్ రోడ్, నెల్లూరు. వివరాలకు సంప్రదించండి : 88858 02000. [NA-23655]

■ నెల్లూరు టౌన్‌పరిధిలో ప్రముఖ సెక్యూరిటీ ఏజెన్సీకి ఫీల్డ్ అనుభవం కల్గివున్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను.వ: 50సం.లోపు. 10th / ఇంటర్ / డిగ్రీ. జీ:20,000 to 25,000. 7680848899. [T-2248]

■ప్రముఖ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు అనుభవం వాక్‌చాతుర్యం కల్గిన లేడీ కౌన్సిలర్ & లేడి ఆఫీస్ ఇంచార్జ్ కావలెను. ✆ 9032030124. [T-2249]

CHANGE OF NAME

I, SYED AMJAD (Old Name), Resident of 9-25/1,Dastagiri Saheb Nagar, Stonehousepet, Navalakula Thota, Nellore - 524002, SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my name as SYED AMJAD ALI (New Name) S/o. SYED KHAJA RAVOOF.

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు, వంటవారు,RMP & డాక్టర్స్ కావలెను.జీ: 15-40 వేలు, ఫ్రీ రూమ్ + భోజనం. HYD. ఫోన్: 7995365999 [HA-98204]

■Dinshaw's (Since 1932) Himacream Ice creamsని కమీషన్ పద్ధతిన Door to Door Orders Book చేయుటకు స్త్రీ / పురుష Sales Executives కావలెను. సంపాదన : 20,000/-Rs + Room Free. మా సంస్థలో Sales Executive గా పని చేసిన వారికి Team Leader Promotion + Manager Promotions ఉంటాయి, ఆ స్థాయిలో సంపాదన ఉంటాయి. Contact: 78010 34111. [NA-23664]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిం దిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.